# నమస్తే తెలంగాణ
# హనుమకొండ
5 | వరంగల్, ఆదివారం 6 ఏప్రిల్ 2025 | HANUMAKONDA


# ప్రజా నాయకుడు పల్లా

- ఎమ్మెల్యేగా ఆయన పనితీరు భేష్
- స్వచ్ఛంద సంస్థ సర్వేలో జనగామ నియోజకవర్గానికి 6వ స్థానం



డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

జనగామ, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరుపై ప్రముఖ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి 6వ స్థానంలో నిలిచారు. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి చేసిన ఈ సర్వేలో ఆయన ముందువరుసలో ఉండడంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల అవసరాలకనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అనేక అభివృద్ధి పనులు చేయడం, ప్రతి ఒక్కరికీ చేరువై ప్రజా నాయకుడిగా ముద్రవేసుకోవడం వంటి అంశాలు ఆయనకు ఈ గుర్తింపు తీసుకొచ్చినట్లు సర్వే సంస్థ పేర్కొన్నది. అంతేగాక ప్రజల హృదయాలను గెలుచుకున్న నేతగా.. చెప్పినప్పుడే పనిచేసి చూపడంలో ముందుండే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమస్య వచ్చిన ప్రతి సందర్భంలో అందుబాటులో ఉండడం, ప్రజలతో నిత్యం అనుసంధానంగా ఉండడం ఆయనకు విశేషమైన విశ్వాసాన్ని తీసుకొచ్చింది. ప్రజల మద్దతే తనకు ప్రధాన బలమని.. ఈ సర్వే ర్యాంకింగ్ ద్వారా మళ్లీ రుజువు అయిందని ఎమ్మెల్యే పల్లా తెలిపారు.



### జనగామ ప్రజల అదృష్టం..

జనగామ రూరల్, ఏప్రిల్ 5 : రాష్ట్రంలోని ఎమ్మెల్యేల పనితీరుపై ఓ స్వచ్ఛంద సంస్థ జరిపిన సర్వేలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పనితీరు బాగుందని రావడం సంతోషం. సర్వేలో 6వ స్థానం ఆయన పనితీరుకు నిదర్శనం. కేవలం పనితీరే కాకుండా ప్రజల కోసం నిత్యం పాటుపడే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రమే. అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తూ ప్రజల ఆరోగ్యం బాగుండాలని తన సొంత ఆసుపత్రిలో జనగామ నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడం గొప్ప విషయం. ఇలాంటి నాయకుడు జనగామ ప్రజలకు దొరకడం అదృష్టం. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే ఆయన.. మరింత సేవ చేసి మొదటి స్థానం సాధించాలని కోరుకుంటున్నా.

– బాల్దె విజయ, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్, జనగామ

# రామా చంద్రమౌళికి వాసిరెడ్డి సీతాదేవి సాహిత్య పురస్కారం



పోచమ్మమైదాన్, ఏప్రిల్ 5 : ఓరుగల్లుకు చెందిన ప్రముఖ కవి, రచయిత రామా చంద్రమౌళికి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి సాహిత్య పురస్కారాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ ఇండియా(హైదరాబాద్) ఆధ్వర్యంలో ఈ ఏడాది అందించే ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందించేందుకు కార్యవర్గం నిర్ణయించినట్లు సంస్థ అధ్యక్షుడు శిరోమణి, డాక్టర్ వంశీ రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ విలక్షణ అభ్యుదయ రచయిత్రి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి పేరున ప్రతిష్ఠితమైన పురస్కారాన్ని గత యాభై ఏళ్ల నుంచి కథా, రచన రంగంలో తనదైన ముద్రవేసిన ఓరుగల్లుకు చెందిన ప్రముఖ కవి, రచయిత రామా చంద్రమౌళికి ప్రదానం చేయడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. ఉగాది సంబురాల్లో భాగంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 12, 13వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే సాహిత్య సంబురాలను రామా చంద్రమౌళికి పురస్కారం అందజేస్తారని వారు వివరించారు. అలాగే 13న కవుల సుదీర్ఘ కవి సమ్మేళనం, అష్టావధానం, పలు పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందని, సభకు కవులు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.




# మక్క రైతుకు ధరాఘాతం

- రెండు నెలల క్రితం క్వింటాలుకు రూ. 2350-2450
- ప్రస్తుతం రూ.200-250 వరకు తగ్గింపు
- వ్యాపారులు సిండికేటై ధర తగ్గిస్తున్నారని అన్నదాతల ఆందోళన

**మక్క ధర రోజురోజుకూ తగ్గుతున్నది. ప్రభుత్వం కొనకపోవడం, మద్దతు ధర తక్కువగా ఉండడంతో రైతులు ప్రైవేటుకే విక్రయిస్తున్నారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో రెండు నెలల క్రితం క్వింటాల్‌కు రూ. 2350-2450 ఉండగా, ప్రస్తుతం రూ.200-250 వరకు తగ్గించారు. ఆరుగాలం శ్రమించి పంట తీసుకొస్తే వ్యాపారులు సిండికేటై ధర తగ్గిస్తున్నారని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

**- నర్సంపేట, ఏప్రిల్ 5**

## ప్రభుత్వం కొనకపోవడంతో ప్రైవేట్‌కు విక్రయిస్తున్న రైతులు

ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2200 మాత్రమే ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రెండు నెలల క్రితం రూ. 2350 నుంచి రూ. 2450 ధర పెట్టి కొనుగోలు చేశారు. వారం రోజులుగా మద్దతు ధరకు మించి కొనడం లేదు. ప్రభుత్వ కొనుగోలుకు 4,5 రోజుల ప్రాసెస్ (ఆరబెట్టడం, తూర్పార బట్టడం, గన్నీ సంచులు నింపడం, టోకెన్లు, సీరియల్ నంబర్లు తదితర సమస్యలు) ఉంటుండడంతో అటువైపుగా రైతులు దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు ఏదో ఒక కూటుకు క్వింటాల్‌కు రూ. 2188 ధర చెల్లించి, మిగిలిన అన్నింటికి క్వింటాల్‌కు రూ. 2156లు చెల్లిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నర్సంపేట నియోజకవర్గంలో ఈసారి 56,150 ఎకరాల్లో మక్కజొన్న పంట సాగు చేయగా, నెక్కొండ మండలంలో 13,450 ఎకరాలు, చెన్నారావుపేటలో 11,380, దుగ్గొండిలో 10,890, నల్లబెల్లిలో 9,880, నర్సంపేటలో 7,500, ఖానాపురం మండలంలో 3,050 ఎకరాల్లో రైతులు మక్కజొన్న పంట వేశారు.



మక్కలను దగ్గరకు నెడుతున్న రైతులు

### ఇబ్బందులు అనేకం..

తేమ పేరుతో వ్యాపారులు రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. 14–15 శాతం కంటే ఎక్కువ మాయిశ్చరైజ్ వస్తేనే మక్కలను కొంటున్నారు. దీంతో రోజుల తరబడి మక్కలను ఆరబోసేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మార్కెట్‌లో సరైన సౌకర్యాలు లేక అష్టకష్టాలు పడుతున్నట్లు చెబుతున్నారు.

### వ్యాపారులు సరిగా రేటు పెట్టడం లేదు



నేను మూడెకరాల్లో మక్కజొన్న సాగు చేశాను. మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులు మక్కలకు సరిగా రేటు పెట్టడం లేదు. ఏదో ఒక రాశికి కొంత రేటు పెట్టి మిగిలినవన్నీ తక్కువ ధరలకే కొంటున్నారు. మద్దతు ధర కూడా రావడం లేదు. రెండు నెలల ముందు మక్కలు చేతికి వస్తే ధరలు అనుకూలించేవి. ప్రస్తుతం ధర తగ్గింది.

– రాపాక మల్లయ్య, రైతు, అశోక్‌నగర్, ఖానాపురం

### సాగుకు పెరిగిన ఖర్చులు



మక్కజొన్న సాగుకు ఖర్చులు బాగా పెరిగాయి. ఎకరం మక్కలు మిషన్ పట్టడానికి రూ. 2500, ఇరిసిన, ఎత్తిన కూలీ రూ.400 నుంచి రూ.450లు, మార్కెట్‌కు తరలించేందుకు రూ. 3 వేల వరకు ఖర్చులయ్యాయి. తీరా ప్రైవేటు వ్యాపారులు సరిగ్గా ధరలు పెట్టకపోవడంతో నష్టం జరుగుతోంది. వ్యాపారులు మద్దతు ధరకు మించి కొనుగోలు చేస్తే కొంత వరకు కలిసొచ్చేది.

– అల్లి శివ, రైతు, గురిజాల, నర్సంపేట మండలం

# క్రికెట్ బెట్టింగ్.. ఐదుగురి అరెస్ట్

- కాజీపేటలో నలుగురు, ఆత్మకూరులో ఒకరు.. పరారీలో ఇద్దరు
- రూ. 20వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



బెట్టింగ్‌లో స్వాధీనం చేసుకున్న డబ్బులు, స్మార్ట్‌ఫోన్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్

కాజీపేట/ఆత్మకూరు, ఏప్రిల్ 5: వేర్వేరు చోట్ల ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న ఐదుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాజీపేట లో నలుగురు, ఆత్మకూరు ఒకరిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారీలో ఉన్నా రు. టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన కొంతమంది ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ పెట్టి ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందానికి స మాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు దాడులు చే సి గొడుగు శ్రీనివాస్, గొడుగు రమేశ్, సముద్రాల శ్రీనివాస్, బోకరి సంతోష్‌లను అదుపులోకి తీసుకొ ని వారి నుంచి రూ.20వేల నగదు, నాలుగు స్మార్ట్ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణ కోసం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. అలాగే ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న ముక్కల రాజును శనివారం అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. మరో ఇద్దరు నల్గొండ జిల్లాకు చెందిన మర్రి సుధీర్‌కుమార్, మర్రి సురేశ్ పరారైనట్లు ఆయన తెలిపారు. రాజు నుంచి రూ. 42,100, స్మార్ట్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ కోసం నిందితుడిని ఆత్మకూరు పోలీసులకు అప్పగించారు. పట్టుకున్న వారిలో ఎస్సై శ్రీధర్, కానిస్టేబుల్స్ ఉన్నారు.

# వరంగల్‌కు ప్రపంచ సుందరీమణులు

- మే 14న రామప్ప టెంపుల్ సందర్శన
- సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 5 : మిస్ వరల్డ్–2025 పోటీలను తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మే 6వ తేదీన ప్రపంచంలోని 144 దేశాలకు చెందిన సుందరీమణులు వారి దేశాల తరఫున అందాల పోటీల్లో పాల్గొనడానికి మే 6, 7వ తేదీల్లో తెలంగాణా రాష్ట్రానికి రానున్నారు. అప్పటి నుంచి మే 31 వరకు తెలంగాణలోనే ఈ పోటీలు నిర్వహించి, చివరగా మిస్ వరల్డ్‌ను ఎంపిక చేస్తారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే వారిని ఐదు బృందాలుగా విభజించి నాగార్జునసాగర్, బుద్ధవనం, వరంగల్ రామప్ప టెంపుల్, యాదగిరిగుట్టతోపాటు వివిధ ప్రదేశాలను ఆయా ఖండాల వారీగా సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వారి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులు వరంగల్ పర్యటనలో భాగంగా సందర్శించే కాళోజీ కళాక్షేత్రం వద్ద చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై కలెక్టర్, అధికారులతో చర్చించారు. సుమారు 30 మంది వరంగల్‌ను సందర్శించనుండడంతో ప్రోగ్రాం ఏ విధంగా ఉండాలి?, వారిని ఎలా రిసీవ్ చేసుకోవాలనే అంశాలపై అన్ని శాఖలతో కో ఆర్డినేట్ చేయాలని కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. మే 14న ఉదయం 11:30 గంటలకు హరిత కాకతీయ హోటల్ చేరుకుంటారని, హోటల్ నుంచి కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించి, అక్కడే విద్యార్థులతో సమావేశమవుతారని, అక్కడి కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి హరిత కాకతీయకు చేరుకుంటారని చెప్పారు. లంచ్ తర్వాత రామప్ప టెంపుల్లో వెళ్తారని, అక్కడే దాదాపు 2 గంటల ప్రోగ్రాం ఉంటుందన్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి డైరెక్ట్‌గా హైదరాబాద్‌కు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశ్రాంత ప్రొఫెసర్ పాండురంగరావు, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకటాపూర్: పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం టూరిజం కార్పొరేషన్ డెవలప్‌మెంట్ సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు, ప్రొఫెసర్ పాండురంగారావు అధికారులతో కలిసి సందర్శించారు. మిస్ వరల్డ్ టీమ్ సందర్శన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, కాకతీయుల చరిత్ర, రామప్ప శిల్పకళ, పేరిణి తాండవం, సాంస్కృతిక కార్యక్రమాలు, జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు.

# దళితబంధు రెండో విడుత నిధుల నిలిపివేత

**రూ.15 కోట్లకు పైగా రుణాలు పెండింగ్**




భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

కమలాపూర్, ఏప్రిల్ 5 : దళితబందు రెండో విడుత నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. డబ్బులు వస్తాయని ఎన్నో రోజుల నుంచి ఆశతో ఎదురుచూస్తున్న లబ్ధిదారుల నోట్లో మట్టి కొట్టింది. బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రెండో విడుత నిధుల కోసం లబ్ధిదారుల పక్షాన ప్రత్యక్ష పోరాటలకు దిగి, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో దళితుల్లో వ్యతిరేకత వస్తుందని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో రెండో విడుత నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిం ది. లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న ఫ్రీజింగ్ తొలగించి రుణా లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించింది. అయినా, లబ్ధిదారులకు రుణాలు రాకపోగా, మళ్లీ రుణాలను నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హుజూరాబాద్ నియోజకవర్గాన్ని దళితబందు పథకంలో పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని లబ్ధిదారులకు యూనిట్లను మంజూరు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన దళితబంధు రెండో విడత రుణాలను నిలిపివేసింది. కమలాపూర్ మండలంలో 18 గ్రామాల్లో 654మంది లబ్ధిదారులకు రెండో విడుతలో రూ.15,57,68,582 నిధులు మంజూరు కావాల్సి ఉండగా, ప్రభుత్వం అసెంబ్లీలో రెండో విడుత నిధులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో కాంగ్రెస్ నాయకులు మేం సాధించామని నియోజకవర్గంలో సంబురాలు జరుపుకున్నారు. లబ్ధిదారులు కూడా కొండంత ఆశతో ఎదురుచూశారు. రెండో విడత రుణాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తీరా, అధికారులు నిధులు నిలిపివేశారని చెప్పడంతో చేసేదేమిలేక వెనుదిరిగి వెళ్తున్నారు. దళితబందు పథకంలో రెండో విడత డబ్బులు ఖాతాల్లో ఫ్రీజింగ్ చేసి ఉండడంతో ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు.

### దళితబంధు నిధుల కోసం ధర్నా

భూపాలపల్లి రూరల్ : మంథని నియోజకవర్గంలోని రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పులి రామన్న ఆధ్వర్యంలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16 నెలల నుంచి దళితబంధు లబ్ధిదారుల రెండో విడుత నిధులు ఫ్రీజింగ్‌లో ఉన్నాయని, దానికి ఎత్తేసి దళితబంధు పథకాన్ని కొనసాగించాలని కోరారు. దళితులను మోసం చేయాలని చూస్తే ఊరుకోమని, రానున్న రోజుల్లో రాష్ట్ర కమిటీ సూచనతో హైదరాబాద్ నడిబొడ్డున భారీ బహిరంగ ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, రేగుంట నర్సయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల సతీశ్, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శిలపాక హరీశ్ పాల్గొన్నారు.

### నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ : సీపీ

సుబేదారి, ఏప్రిల్ 5: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి వచ్చే నెల 5 వరకు సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిప్రకారం పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించొద్దు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు. డీజేలను వినియోగించొద్దు. మైక్‌లు ఏర్పాటు చేయాలనుకునే వారు ఏసీపీ నుంచి అనుమతి తీసుకోవాలని సీపీ సూచించారు. ఉత్తర్వులను అతిక్రమిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


























